

అరసవల్లి ఆదాయం రూ.7.26 లక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి సందర్శకుల తాకిడి పెరిగింది. దీంతో ఆదివారం ఒక్క రోజు రూ.7.26 లక్షల ఆదాయం సమకూరింది. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3.96 లక్షలు, విరాళాల రూపంలో రూ.78,890, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,51,840 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శ్రీకాకుళం రూరల్ మండలం కిల్లిపాలెంకు చెందిన సింహాద్రి వెంకట రమణమూర్తి, జ్యోతి దంపతులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆలయ ఇఒ చంద్రశేఖర్‌కు చెక్కును అందజేశారు.



నినదాలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

దశల వారీ పోరాటాలకు సన్నద్ధం

ఎండిఎం యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మహాలక్ష్మి

ప్రజాశక్తి - హిరమండలం

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దశల వారీ పోరాటాలకు సన్నద్ధం కావాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం రూ.పది వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులుగా గుర్తించడం లేదని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయకుండా పని చేయించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, కార్మికుల బతుకుల్లో మార్పు లేదన్నారు. మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచడం లేదని చెప్పారు. వంట సమయంలో ప్రమాదం సంభవిస్తే ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, కార్మికులకు ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించే పద్ధతి ఆపాలని కోరారు. పాఠశాలలో మంచినీరు, వంటషెడ్డు, వంటపాత్రలు తదితర మౌలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఐదో తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెలించడంతో పాటు మెనూ ఛార్జీలను రూ.20కి పెంచాలన్నారు. కార్మికుల్లో ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబానికి మట్టి ఖర్చులను ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. వంట కార్మికుల సమస్యలపై యూనియన్ ఆధ్వర్యాన పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పరిష్కారం కాలేదన్నారు. కొత్త ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సంఘ మండల నాయకులు జి.చెంచులక్ష్మి, వి.నాగరత్నం, కె.రేణుక, ఎన్.పార్వతి, ఎ.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.



నాగావళి నదిని శుభ్రం చేస్తున్న యువకులు, కార్మికులు

స్వచ్ఛ నాగావళి అందరి బాధ్యత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరవాసులకు దాహార్తిని తీర్చే నాగావళి నది పరిరక్షణకు అందరూ ముందుకు రావాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ వెంకటరావు పిలుపునిచ్చారు. నగరంలోని హయాతీనగరం ఒడ్డున నాగావళి నది పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు పెద్దసంఖ్యలో తరలివచ్చి శుభ్రత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక యువకుని మదిలో వచ్చిన ఆలోచన సామాజిక మాధ్యమాల్లో చూసి నగరవాసులు కలిసికట్టుగా ఇందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రాణులకు అవసరమైన నీటిని నదులు అందిస్తున్నాయని, రైతాంగానికి సాగునీరందిస్తున్నాయని చెప్పారు. నాగావళి నది కలుషితం కాకుండా చూసే బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు.

నగరవాసులు చెత్త, ఇతర వ్యర్థాలను నదిలో వేయకుండా ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలని, వీధుల్లో ఏర్పాటు చేసే చెత్త కుండీల్లో వేయాలని సూచించారు. శ్రీకాకుళం నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, జి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ జి.ఎన్ రావు, టిడిపి నాయకులు వెంకన్న యాదవ్, ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం అధికారులు, విష్ణుమూర్తి, హలో సిక్కోలు ప్రతినిధులు పి.ప్రశాంత్, మధు తదితరులు పాల్గొన్నారు.




అసంపూర్తిగా ఉన్న ఆఫ్‌షోర్ ప్రాజెక్టు

సమస్యలు ఇవీ...

- పడకేసిన వంశధార, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు
- హార్బర్లు, జెట్టీల నిర్మాణాలు పూర్తి కాక మత్స్యకారుల్లో ఆగని వలసలు
- పదేళ్లలో ఒక్క కేంద్ర ప్రభుత్వ సంస్థ ఏర్పాటు కాని వైనం
- కేంద్ర, రాష్ట్ర మంత్రుల పైనే ఆశలు
- నేడు అచ్చెన్న, రామ్మోహన్ నాయుడు జిల్లాకు రాక

చొరవ చూపాలి మరి

జిల్లాలో అనేక సమస్యలు ముసురుకున్నాయి. ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన వంశధార, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు పడకేశాయి. ఐదేళ్లు గడిచినా ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. జిల్లాలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నా, రైతులను కరువు పరిస్థితులు వీడడం లేదు. పోర్టులు, జెట్టీల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో చేపల వేట సాగక వలసల పరంపర కొనసాగుతూనే ఉంది. గత ఐదేళ్ల కాలంలో జిల్లాకు ఒక్క పరిశ్రమ కూడా రాకపోవడంతో ఉపాధి కోసం యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతోంది. ఈసారి కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాల్లో జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కడంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన మంత్రిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా అచ్చెన్నాయుడు బాధ్యతల స్వీకరణ అనంతరం సోమవారం తొలిసారి జిల్లాకు రానున్నారు.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ప్రాజెక్టు పూర్తికి అనేక పర్యాయాలు ఒప్పంద కాలపరిమితిని పొడిగించినా, ఏనాడూ అనుకున్న సమయానికి పూర్తి కాలేదు. 2015లో జరిగిన ఒప్పందం ప్రకారం అక్టోబర్ 28, 2017 నాటికి పూర్తి కావాలి. ఇప్పటివరకు 94.5 శాతం పనులు పూర్తయ్యాయి. 87 ప్యాకేజీ పనులు 90 శాతం, 88 ప్యాకేజీ పనులు 94 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 94.50 శాతం పనులు జరిగాయి. వంశధార ప్రాజెక్టుకు సంబంధించి మరోవైపు భూసేకరణ కూడా పెండింగ్‌లో ఉంది. 87 ప్యాకేజీ కింద చేపడుతున్న కాలువ తవ్వకాలకు 71.32 ఎకరాల భూమి అవసరం. అధికారులు ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసినా, సంబంధిత రైతులకు రూ.9.20 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయకపోడంతో, కాలువ తవ్వకాలు ముందుకు సాగడం లేదు. 88 ప్యాకేజీ కింద చేస్తున్న కాలువ పనులకు 20.16 ఎకరాలు కావాల్సి ఉంది. రైతులకు రూ.2.92 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ సమస్యలను పరిష్కరిస్తే గానీ ప్రాజెక్టు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌దీ అదే పరిస్థితి

టెక్కలి, నందిగాం, పలాస, మెళియాపుట్టి మండలాల్లోని 24,600 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో 2007లో ప్రారంభించిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నేటికీ పూర్తి కాలేదు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత నిర్మాణ సంస్థ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. మిగిలిన పనులకు సంబంధించి కొత్త రేట్లతో రూ.855 కోట్ల అంచనా వ్యయంతో 2021 సెప్టెంబరులో అధికారులు ప్రతిపాదనలు పంపగా, 2022 సెప్టెంబరులో సవరించిన అంచనాల మేరకు రూ.852.45 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2014 నుంచి ఇప్పటివరకు 45 శాతం పనులు మాత్రమే జరిగాయి.

అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు ఇవే...

సాగునీటి ప్రాజెక్టులు ఇప్పుడిప్పుడు పూర్తయ్యే అవకాశం లేనందున సాగునీటి సమస్యల పరిష్కారానికి కొన్ని అత్యవసర పనులు చేపట్టాల్సి ఉంది. వంశధార కుడి, ఎడమ కాలువల్లో విపరీతంగా గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోవడంతో సాగునీటి ప్రవాహం సాఫీగా సాగే పరిస్థితి కనిపించడం లేదు. పనులు ఆలస్యంగా మొదలుపెడుతుండడం, సరిపోయినంత నిధులు విడుదల చేయకపోవడంతో కొన్నిచోట్ల రైతులే తమ సొంత డబ్బులతో కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగించుకున్నారు. ఈ ఏడాదైనా తగినంత మేర నిధులు విడుదల చేసి పనులు చేపడితే ఇబ్బందులు తీరుతాయి. ఇప్పటికే అధికారులు వంశధారలో కుడి, ఎడమ కాలువల్లో గుర్రపుడెక్క, పూడికతీత పనులకు రూ.95 లక్షలు అవసరమని వంశధార అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని తక్షణం విడుదలయ్యేలా చూడాల్సిన ఆవశ్యకత ఉంది.

ఫిషింగ్ హార్బర్, జెట్టీల పూర్తితోనే వలసలకు అడ్డుకట్ట

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాగరమాల ప్రాజెక్టుల్లో భాగంగా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని 2020లో నిర్ణయించారు. 2022 మేలో టెండర్లను పిలిచిన ప్రభుత్వం, విజయవాడకు చెందిన విశ్వసముద్ర ఇంజినీరింగ్ లిమిటెడ్‌కు నిర్మాణ బాధ్యతలను అప్పగించింది. ఈ ఏడాది మే నాటికి మొదటి దశ పూర్తి చేస్తామని టెండర్లను ఖరారు చేసిన సమయంలో ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు నిర్మాణానికి సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం, రాళ్లపేటలో జెట్టీ, కవిటి మండలం ఇద్దివానిపాలెంలో జెట్టీ, సోంపేట మండలం బారువలో జెట్టీ, వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవుల-మంచినీళ్లపేట జెట్టీ నిర్మాణం పనులూ అసంపూర్తిగానే ఉన్నాయి.

అవసరమేర విత్తనాలు కేటాయించాలి

జిల్లాలో 2024 ఖరీఫ్‌లో 3,87,322.5 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అంచనా వేశారు. ఇందు కోసం 1.16 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంది. ప్రభుత్వం మాత్రం 38,882 క్వింటాళ్లు కేటాయిస్తామని చెప్తోంది. రైతుల దగ్గర విత్తనాలు, 50 శాతం మేర ప్రయివేట్ డీలర్లకు కేటాయించడంతో సబ్సిడీ విత్తనాలపై కోత విధించింది. దీంతో విత్తనాల కోసం రైతులు బహిరంగ మార్కెట్లో కొనాల్సి వస్తోంది. రైతులపై భారం పడకుండా ప్రభుత్వం చూడాల్సి ఉంది.

పదేళ్లలో ఒక్క కేంద్ర ప్రభుత్వ సంస్థ రాని వైనం

జిల్లాలో ఐదేళ్ల కాలంలో కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు. పైగా ఫెర్రో ఎల్లాయిస్, జ్యూట్ వంటి పరిశ్రమలు మూతపడ్డాయి. ఎన్‌డిఎలో చేరిన టిడిపికి భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి పదవిని బిజెపి కేటాయించింది. కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవ చూపి ఒకట్రెండు పరిశ్రమలను జిలాకు తీసుకురాగలిగితే, జిల్లాకు చెందిన యువతకు కొంతమేర ఉపాధి కల్పించే వీలుంటుంది. 2014-18 కాలంలో ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వంలో ఉన్న టిడిపి జిల్లాకు ఒక్క కేంద్ర ప్రభుత్వ సంస్థనూ తీసుకురాలేదన్న విమర్శలను మూటగట్టుకుంది. ఈసారైనా అటువంటి ఉన్నత సంస్థలను తీసుకురాగలిగితే అభివృద్ధికి కొంత ఆస్కారం కలుగుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.



నేడు కేంద్ర, రాష్ట్ర మంత్రులు రాక

కేంద్ర, రాష్ట్ర కేబినెట్‌లో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తొలిసారిగా నేడు జిల్లాకు రానున్నారు. వారికి ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఉదయం 10.15 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన ర్యాలీగా జిల్లాకు బయలుదేరుతారు. మధ్యాహ్నం 1.30 గంటలకు భోగాపురం వద్ద భోజన విరామం. 2.30 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు శ్రీకాకుళం సింహద్వారం వద్దకు చేరుకుంటారు. అక్కడ్నుంచి డే అండ్ నైట్ కూడలి మీదుగా ఏడు రోడ్ల కూడలి, జి.టి రోడ్డు, సూర్యమహల్ కూడలి, అరసవల్లి కూడలి మీదుగా 80 అడుగుల రోడ్డులోని రామ్మోహన్ నాయుడు నివాసానికి ఐదు గంటలకు చేరుకుంటారు. అక్కడ్నుంచి సూర్యమహల్, రామలక్ష్మణ కూడలి, పెద్దపాడు మీదుగా రాత్రి ఏడు గంటలకు నిమ్మాడ చేరుకుంటారు.

ఖరీఫ్‌కు వరి విత్తనాలు సిద్ధం

- ఆర్‌బికెల్లో పంపిణీ ప్రక్రియ ప్రారంభం
- 3.87 లక్షల ఎకరాల్లో వరి సాగు
- వ్యవసాయ శాఖ జెడి కె.శ్రీధర్



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులను అన్నివిధాలుగా సన్నద్ధం చేస్తున్నట్లు వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ తెలిపారు. సాగుకు అవసరమైన విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో ఇప్పటికే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు కొంత అనుకూల పరిస్థితి ఉంటుందని అభిప్రాయపడ్డారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4.35 లక్షల ఎకరాల్లో వేసేలా ప్రణాళికను సిద్ధం చేసినట్లు చెప్పారు. అందులో 3,87,323 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఖరీఫ్‌కు సంబంధించి పలు అంశాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.


ఖరీఫ్ సాగుకు రైతులను ఏవిధంగా సన్నద్ధం చేస్తున్నారు?

ఖరీఫ్ సాగుకు సంబంధించి ఇప్పటికే వర్షాలు కురవడంతో రైతులు నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. రైతులకు అవసరమైన అన్నిరకాల విత్తనాలను రైతుభరోసా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించాం. ఇప్పటికే విత్తనాల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఎరువులను కూడా రైతుభరోసా కేంద్రాల్లోనే అందిస్తున్నాం. రైతులకు సాగులో అవసరమైన సలహాలు, సూచనలు, మెళకువలను వ్యవసాయశాఖ అధికారులు, సహాయకులు అందిస్తున్నారు.

విత్తనాల సరఫరా ఏమేరకు చేపట్టారు?

విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా జిల్లాలో 36,420 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేశాం. వీటిలో రాయితీపై మరికొన్ని నిర్దేశించిన ధరకు విక్రయించాల్సి ఉంటుంది. పలు రాయితీ విత్తనాలు 34,200 క్వింటాళ్లుఅందుబాటులో ఉన్నాయి. వాటిలో మార్టేరు సాంబ 25 కేజీల ప్యాకెట్ రూ.1045 కాగా రూ.250 రాయితీ, రూ.795 రైతు చెల్లించాల్సి ఉంటుంది. గిరిజన ప్రాంత రైతులకు రూ.940.50 రాయితీ, రూ.104.50 రైతు చెల్లించాల్సిన ధరగా నిర్ణయించాం. పలురకాల విత్తనాలకు నిర్ణయించిన ధరలకు అనుగణంగా రాయితీ లభిస్తోంది. ఐదు గిరిజన సబ్‌ప్లాన్ మండలాల్లో రైతాంగానికి 2,220 క్వింటాళ్ల విత్తనాలు 90శాతం రాయితీపై అందించేందుకు సిద్ధం చేశాం. జిల్లాలో రైతుల అవసరాలకు తగ్గట్లుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

ఖరీఫ్ పంటల కార్యాచరణ ప్రణాళిక ఏమిటి?



జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,35,165 ఎకరాల్లో వేసేలా ప్రణాళికను సిద్ధం చేశాం. అందులో 3,87,323 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అంచనా. జొన్న, మొక్కజొన్న, సజ్జలు, రాగులు తదితర తృణ ధాన్యాలు 26,685 ఎకరాల్లో సాగవుతాయి. వీటిలో సజ్జలు 165 ఎకరాలు, మొక్కజొన్న 26,375 ఎకరాలు, రాగులు 145 ఎకరాల్లో సాగు చేసే అవకాశముంది. ఈ సీజన్‌లో 860 ఎకరాల్లో పప్పుధాన్యాలు సాగు లక్ష్యంగా నిర్ధేశించడమైంది. వీటిలో కందులు 335 ఎకరాలు, పెసలు 252.5 ఎకరాలు, మినుములు 272.5 ఎకరాల్లో వేయనున్నారు. నూనెగింజలు 1430 ఎకరాల మేర సాగయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. వీటిలో వేరుశనగ 1332.5 ఎకరాలు, నువ్వులు 97.5 ఎకరాల్లో సాగు చేయొచ్చని అంచనా. పత్తి 4,620 ఎకరాలు, గోగు పంట 257.5 ఎకరాలు, చెరుకు 4,550 ఎకరాల్లో వేయనున్నారు. మిరప పది ఎకరాలు, ఉల్లి 2.5 ఎకరాలు, పసుపు 60 ఎకరాల్లో సాగు చేయనున్నారు.

నైర వ్యవసాయ కళాశాలలో కొత్త వరి వంగడాలు ఈ ఏడాది అందుబాటులో ఉన్నాయా?

ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న నైర వ్యవసాయ కళాశాల ఏటా ఫౌండేషన్ సీడ్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. పలురకాల ఫౌండేషన్ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఈ ఏడాదీ కళాశాల తరపున విత్తనాభివృద్ధి జరిగింది. రైతుస్థాయిలో విత్తనోత్పత్తి చేయడానికి అవసరమైన వరి నాణ్యమైన మూల విత్తనం అందించడమైంది. అత్యధిక జన్యు స్వచ్ఛత (99 శాతం), భౌతిక స్వచ్ఛత (98 శాతం), మొలక (80-100శాతం), నిర్దేశింపబడిన తేమశాతం (11-13 శాతం) ఉండే విత్తనాలను వారు సిద్ధం చేస్తున్నారు. ఏటా వారి నుంచి తీసుకుంటున్న విత్తనాల వల్ల రైతాంగానికి ఎంతో మేలు చేకూరుతోంది. సాంబమసూరి (బిపిటి 5204), స్వర్ణ (ఎంటియు)7029, ఎంటియు 1121 (శ్రీధతి), ఎంటియు 1224 (మార్టేరుసాంబ), ఎంటియు 1210 (సుజాత), ఎంటియు 1061 (ఇంద్ర), ఎంటియు1064 (అమర), ఎంటియు1318 (ఫ్రీ రిలీజ్డ్), వంటి వాటితో పాటు ఏటా కొత్త రకాన్ని పరిచయం చేస్తున్నారు.

ఎరువుల వాడకంలో రైతులకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

అధిక దిగుబడులు, పంటలో చీడపీడల నివారణకు ఎరువులు, పురుగు మందులను రైతులు అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. వాటి వాడకాన్ని తగ్గించేందుకు వీలుగా రైతుల్లో ఇప్పటికే అవగాహన కల్పించడమైంది. గ్రామ, మండలస్థాయి వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ఎరువుల వాడకంపై తగిన సూచనలు చేస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సిఫార్సు చేసిన మోతాదుల్లో మాత్రమే వాడితే రైతులకు మేలు చేకూరుతుంది. పొటాష్ వాడకం మొదటి విడతగా దమ్ములో, రెండో విడతగా అంకురం సమయంలో వేసుకోవాలి. మేలైన నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం పాటించకపోవడం వల్ల రైతుకు నష్టం వాటిల్లుతోంది.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో వర్షాబావ పరిస్థితులు ఎదుర్కొనే మెట్ట ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా పలు పంటలను సాగు చేసుకునేందుకు వీలుంది. ఈ ప్రాంతాల్లో రాగి, వేరుశనగ, మినప, పెసర, పిల్లి పెసర, ధైంసా, సన్ ఫ్లవర్ సాగుకు అనుకూలం. అందులో భాగంగా జిల్లాలో సన్‌ఫ్లవర్ 516 క్వింటాళ్లు, ధైంసా 1020 క్వింటాళ్లు, పిల్లి పెసర నాలుగు క్వింటాళ్లు, పెసర 90 క్వింటాళ్లు, మినుములు వంద క్వింటాళు ,, రాగి 32 క్వింటాళ్లు, వేరుశనగ 700 కింటాళ్లు సిద్ధం చేయడమైంది. ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే రైతాంగానికి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగణంగా అందించనున్నాం.

స్విమ్మింగ్‌కు పూర్వవైభవం

స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మోహన వెంకటరాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్విమ్మింగ్‌కు రాష్ట్రంలో ఆదరణ పెరుగుతోందనిస్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మోహన వెంకటరాం తెలిపారు. నగరంలోని గాంధీనగర్‌లో ఉన్న హారికా కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో స్విమ్మింగ్‌కు పూర్వ వైభవాన్ని తీసుకొస్తామన్నారు. స్విమ్మింగ్ పూల్ నిర్వహణ ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. సిబ్బంది కొరత, నిర్వహణా లోపాలతో స్విమ్మర్స్ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. శాప్ పరిధిలోకి స్విమ్మింగ్ పూల్ నిర్వహణను తీసుకోవాలని కోరారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జాతీయ, ఏషియన్ స్విమ్మింగ్ పోటీలను నిర్వహించడమైందని, గత ఐదేళ్లుగా ఎటువంటి పోటీలు నిర్వహించలేదని చెప్పారు. ఫెడరేషన్ల సహకారంతో నేషనల్స్‌కు, సీనియర్ నేషనల్స్‌కు అధిక సంఖ్యలో క్రీడాకారులను పంపగలుగుతున్నామని తెలిపారు. పోటీల్లో గెలిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో హారికా ప్రసాద్ నేతృత్వాన అసోసియేషన్ స్విమ్మింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో కోచ్‌లకు జాతీయ స్థాయి కోచ్‌లతో ఉన్నత శిక్షణ అందిస్తామన్నారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.ఎన్.ఎస్.వి ప్రసాద్ (హారికా ప్రసాద్), ఉపాధ్యక్షులుగా ఎన్ని సూర్యారావు, ఎస్.రాధాకృష్ణ, ఎస్.జోగినాయుడు, ఎం.విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కె.ఝాన్సీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.కాంతారావు, సంయుక్త కార్యదర్శులుగా పి.వరప్రసాద్, వై.వెంకటేష్, బి.బాషా, డి.చక్రధరరావు, కోశాధికారిగా బి.సోమేశ్వరరావు, స్విమ్మింగ్ అడ్వైజర్స్‌గా డి.మురళీధరరావు, కె.ఆశిష్, లీగల్ అడ్వైజర్‌గా ఎ.అప్పలరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎ.లక్ష్మీనారాయణ, వై.చంద్రశేఖర్, కె.హారిక, బి.అనంతరావు, ఎం.శాంతారావు, బి.యశ్వంతరావు, టి.సతీష్‌కుమార్, ఎస్.భార్గవ్, కె.చంద్రభాను ఎన్నికయ్యారు.


వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- నందిగాం

ఉపాధ్యాయ సమస్యలు, విద్యా వ్యవస్థ అభివృద్ధి దృష్టిసారించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి బమ్మిడి నరేంద్రకుమార్ కోరారు. ఈ మేరకు రాజధానిలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ దుశ్శాలువతో సన్మానించారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ బోధనలను కొనసాగించాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలకూ డిజిటల్ అసిస్టెంట్ నియమించి ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. తల్లికి వందనం పథకం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రమే అందించాలని కోరారు. ఉపాధ్యాయులు బదిలీలు చేపట్టాలన్నారు. అన్ని ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు, పిఇటి పిఈటి పోస్టులను కల్పించాలన్నారు. ఈయనతో పాటు సూర అప్పారావు, ఎస్.ముకుందరావు, ఎ.శారద, వి.రాజారావు ఉన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి


శాంతిస్వరూపరెడ్డి

నౌపడ : కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, మత్స్యకార, పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం జిల్లాకు రానున్నారని టిడిపి నాయకులు సగ్గు శాంతిస్వరూపరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, టిడిపి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విశాఖపట్నం విమానాశ్రయం వద్దకు ఉదయం తొమ్మిదిన్నర గంటలకు చేరుకుంటారని అన్నారు. చిలకపాలెం వద్ద నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నారని, కార్యకర్తలు, నాయకులు పాల్గొవాలని కోరారు.


విజేతలతో ఎస్ఐ సత్యనారాయణ

క్రికెట్ టోర్నీ విజేత సత్యవరం

ప్రజాశక్తి- పోలాకి

బావని శ్రీనివాసరావు మెమోరియల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌లో మ్యాచ్‌లో తలసముద్రం, సత్యవరం టీమ్‌లు ఆదివారం తలపడ్డాయి. ఇందులో సత్యవరం విజేతగా నిలిచింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ సత్యనారాయణ విజేతలకు ట్రోఫీ, నగదును అందజేశారు. ముందుగా బ్యాటింగ్ చేసిన తలసముద్రం టీమ్ నిర్ణీత 10 ఓవర్లకు 59 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సత్యవరం టీం తొమ్మిది ఓవర్లో 60 పరుగులు చేసి విజేతగా నిలిచింది. జూన్ 7న ప్రారంభమైన ఈ టోర్నీలో జిల్లాస్థాయిలో 56 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల మానసికోల్లాసం కలుగుతుందన్నారు. టీమ్‌గా వెళ్లడం వల్ల స్నేహభావం పెరుగుతుందన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం

రైతులకు అందని విత్తనాలు

ప్రజాశక్తి- బూర్జ

ఖరీఫ్ సాగు కోసం మండలంలోని రైతులు సన్నమయ్యారు. కానీ, ఇంతవరకు మండల వ్యవసాయశాఖ అధికారులు విత్తనాలు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. వేసవి దుక్కులు పూర్తిచేసుకుని విత్తనాల కోసం ఎదురుచూస్తున్నామని రైతుల పేర్కొన్నారు. విత్తనాల కోసం నమోదు చేసుకున్నా... ఇంతవరకు విత్తనాలు ఇవ్వడంలో వ్యవసాయశాఖ అధికారులు శ్రద్ధ చూపు లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి దుక్కులు దున్ని విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే శుక్రవారం కురిసిన భారీ వర్షంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. సమయానికి వ్యవసాయశాఖ అధికారులు విత్తనాలు అందజేయకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలోని రైతులు విత్తనాలను ప్రయివేటు డీలర్లను, దళారులను ఆశ్రయించి కొనుగోలు చేసుకుని జల్లుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితిలో అధిక ధరలకు విత్తనాలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై మండల వ్యవసాయశాఖ అధికారి వి.రాజేశ్వరరావు వద్ద ప్రస్తావించగా, మండలానికి సంబంధించి 1200 క్వింటాలు విత్తనాలు అవసరమని తెలిపారు. అయితే ఇంతవరకు మండలంలోని రైతులు 400 క్వింటాలకు మాత్రమే రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. ఇంతవరకు మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాలకు 300 క్వింటాలు విత్తనాలు వచ్చాయని, త్వరలో రైతులకు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.


దుక్కు దున్నుతున్న ట్రాక్టర్

విత్తనాలు అందలేదు



వర్షాలు కురుస్తున్న సమయంలో వరి సాగుకు సంబంధించి విత్తనాలను అధికారులు అందజేయలేదు. ప్రస్తుతం లేని పరిస్థితులు వల్ల ప్రయివేటు డీలర్ల వద్ద విత్తనాలను కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో విత్తనాలను అందజేయాలి.

- టి.అప్పారావు, సింగన్నవలస, రైతు


ట్రోఫీని అందజేస్తున్న రామారావు, ప్రకాష్

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- కవిటి

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్సీ ఎన్.రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. నియోజకవర్గంలోని శవసానపుట్టుగలో ఆదివారం క్రికెట్ పోటీల ముగింపు వేడుకల్లో వీరు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో బోడూరు జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ.13వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీ గెలుపొందగా, ద్వితీయ స్థానంలో నిలిచిన కత్తివరం జట్టు రూ.8 వేలు నగదుతో పాటు షీల్డు గెలుచుకుంది. విజేతలకు వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇప్పిలి కృష్ణారావు, చక్రవర్తి, శివాజీ పాల్గొన్నారు.

తోఫా పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 17న బక్రీద్ పండగ సందర్భంగా నగరంలోని జామియా మసీదులో ఆదివారం కమిటీ అధ్యక్షులు మహిబుల్లా ఖాన్, గౌరవ అధ్యక్షులు హాజీ అమిరుల్లా బేగ్ ఆధ్వర్యాన ఆదివారం తోఫా పంపిణీ చేశారు. వంద మంది ముస్లిం కుటుంబాలకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో హాజీ బయ్యా, అక్బర్ బాష, షుకుర్ ఖాన్, ఉస్మాన్, గుత్తి రఫీ, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ సాధిక్ పాల్గొన్నారు.


తోఫాను పంపిణీ చేస్తున్న మహిబుల్లా ఖాన్

రాజకీయ జీవితాలను మార్చేసిన సిపిఎస్ రోడ్డు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గత ఐదేళ్ల నిర్లక్ష్యానికి గురైన సిఎస్‌పి రహదారి ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో మాజీ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంల రాజకీయ జీవితాలనే మార్చేసిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి ఆమదాలవలసకు వెళ్లే తొమ్మిది కిలోమీటర్ల గోతుల రహదారి ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. అడుగుకు ఒక గొయ్యి ఉండడంతో పలు ప్రమాదాల్లో చాలా మంది మృత్యువాత పడడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ రహదారి దుస్థితిపై ధర్మాన, తమ్మినేని కనీసం పట్టించుకోలేదన్న ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన వాహనదారులు రెండు నియోజకవర్గ ఓటర్లు ఎన్నికల్లో బుద్ధిచెప్పడం ఖాయమని అప్పట్లో పలువురు బహిరంగంగానే విమర్శించారు. ఈ రహదారి పుణ్యమా అంటూ ఇద్దరు వైసిపి ముఖ్య నాయకులూ ఓటమికి ఒక ప్రధాన కారణం కావడం విశేషం. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో శ్రీకాకుళం - ఆమదాలవలస రహదారి 9 కిలోమీటర్లు పూర్తిస్థాయి అభివృద్ధి చెందుతుందని రెండు నియోజకవర్గాల ప్రజలు, వాహనదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


రాగోలు వద్ద గోతులమయమైన రోడ్డు


రణస్థలం : శుభాకాంక్షలు తెలుపుతున్న రజకులు

ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి- రణస్థలం

సొండిలను ఒబిసిలో చేర్పించేందుకు సహకరించాలని ఎపి సొండీల సంక్షేమ సంఘం అధ్యక్షులు రత్నాల కాశీ విశ్వనాథ్‌చౌదరి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సొండిలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రత్నాల శ్రీనివాసరావు, ఆర్.నరసింహమూర్తి, ఎస్.నాగేశ్వరరావు, భాస్కరరావు, నెమలిపురి బాలరాజు, శనాపతి కళ్యాణ్‌కుమార్, వరప్రసాదరావు పాల్గొన్నారు. అలాగే లావేరు మండలానికి చెందిన రేషన్ డీలర్లు సంగంనాయుడు, ఎల్.అబ్బినాయుడు, బాడిత హరికృష్ణ, వీర్రాజు, డి.వీరబాబు, ఐ.అప్పడు, సత్తిబాబు, ఇజ్జడా వెంకటరమణ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే ఎచ్చెర్ల రజకుల సంఘ నాయకులు, విజయనగరం పార్లమెంట్ రజక సాధికార కమిటీ కన్వీనర్ గురజాపు రాము ఆధ్వర్యాన ఎమ్మెల్యేను నడుకుదిటిపాలెంలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సోపేటి రామారావు, జోన్నాడ భాస్కరరావు, శీల సూరిబాబు, లక్ష్మి, రామారావు, సురేష్, మాలచ్చి, కృష్ణ, ప్రసాద్, నారాయణరావు పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని మబగాంలోని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దంపతులను టిడిపి నాయకులు వారాడ గణపతిరావు మర్యాదపూర్వకంగా కలిసి వెంకటేశ్వర స్వామి చిత్రపటానికి బహుమతిగా అందించారు. కార్యక్రమంలో చింతు వెంకటరమణ, వాన రాంబాబు, బి.కోటేశ్వరరావు, కింజరాపు వంశీకృష్ణ పాల్గొన్నారు.

వ్యాపారవేత్త చంద్రమౌళి మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


చంద్రమౌళీశ్వరరావు (ఫైల్)

నగరంలోని చంద్రమౌళి డిపార్టుమెంటల్ స్టోర్స్ వ్యవస్థాపకులు పట్నాల చంద్రమౌళీశ్వరరావు (72) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. చిన్న బరాటం వీధిలో ఆయన నివాసం ఉంటున్నారు. ఉదయం ఛాతీలో నొప్పి రావడంతో ఆయనను ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. నిత్యావసర సరకుల విక్రయాలతో ప్రారంభమైన ఆయన అంచెలంచెలుగా ఎదిగి వ్యాపారాన్ని విస్తరించారు. నగరంలో ప్రస్తుతం ఐదు ప్రాంతాల్లో స్టోర్స్‌ను నిర్వహిస్తున్నారు. వ్యాపార వేత్తలతో పాటు వినియోగదారులపై మర్యాద పూర్వకంగా వ్యవహరించే ఆయనకు జిల్లాలోని అనేక ప్రాంతాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆయన మృతి చెందారన్న విషయం తెలుసుకున్న నగరంలోని వ్యాపార వేత్తలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్‌కు దానమిచ్చారు. కుటుంబ సభ్యులు జామి రమేష్, పట్నాల నవీన్‌కుమార్‌ల సమక్షంలో నేత్రాలయ సిబ్బంది రెటీనాను సేకరించారు.


ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

క్షతగాత్రునికి అండ

కవిటి: మండలంలోని శిలగాంకు చెందిన క్షతగాత్రుడు కాల తాతయ్యకు జైహింద్ సేవా ఫౌండేషన్ అండగా నిలిచింది. నిర్మాణ పనుల్లో భాగంగా టైల్స్ బండి నుంచి టైల్స్ బయటకు తీస్తుండగా తాతయ్య కాళ్లపై పడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స కోసం రూ.10 లక్షలకు పైగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో రెక్కాడితే గాని డొక్కాడని తాతయ్య కుటుంబ సభ్యులు దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. విషయం తెలుసుకున్న జైహింద్ సేవా ఫౌండేషన్ సంస్థ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని తక్షణ సహాయంగా తాతయ్యకు రూ. 16,500లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, జైహింద్ సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాధవరావు

అరుంధతిరాయ్‌పై కేసును ఉపసంహరించుకోవాలి

పలాస : రచయిత్రి అరుంధతిరాయ్‌పై ఉపా కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. మండలంలోని నీలావతిలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్ల నాటి క్రితం కేసులు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా ఇలా అనుమతి మంజూరు చేయడం దురుద్దేశంతో కూడినదని అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం గొంతు ఎత్తే వారిని అణచివేయడంలో ఇది భాగమేనని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి

మెళియాపుట్టి : మండలంలో పెద్దలక్ష్మీపురానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. టెక్కలి-పెద్దలక్ష్మీపురం మధ్య నడిచే బస్సు సౌకర్యం కొన్నేళ్ల నుంచి నడుస్తుంది. గత రెండేళ్లుగా గ్రామ రహదారి బాగులేక పోవడంతో బస్సు సౌకర్యం లేకుండాపోయింది. ప్రస్తుతం గ్రామానికి తారు రోడ్డు వేశారు. అయినా బస్సు సౌకర్యం లేకపోవడంతో ఈ ప్రాంతంలోని దాదాపు 15 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆటోలు, ప్రయివేట్ బస్సులకు ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రజల ఇబ్బందులు దృష్ట్యా ఆర్‌టిసి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతున్నారు.


నియామక పత్రాన్ని అందజేస్తున్న దుర్గారావు

జాబ్‌మేళాకు స్పందన

నరసన్నపేట : స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత హాజరయ్యారు. హెచ్‌ఆర్ కో-రిక్రూట్మెంట్ ఏజెన్సీ సహకారంతో నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు సుమారు 150 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సామర్థ్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వీరిలో 42 మందిని ఆక్సిస్ బ్యాంకు, పేటిఎం, టాటా ఎలక్ట్రానిక్స్, సదర్ ల్యాండ్ తదితర కంపెనీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్ కోహెడ్‌పి కార్తీక్ మాట్లాడుతూ డిగ్రీ పట్టాతో పాటు ఉద్యోగ నైపుణ్యాలు అవసరమని తెలిపారు. రానున్న కాలంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అన్ని రంగాల్లో సమూల మార్పులు తీసుకొస్తుందని దానికి అనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కల్పించే విధంగా తమ కళాశాలలో తరచు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అన్ని ఉద్యోగాల కోసం తగిన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. తమ కళాశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రాన్ని నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముకల్ల శ్రీనివాసరావు, ఎఒ మెండ మోహన్‌దాస్, ఏజెన్సీ ప్రతినిధులు నవీన్, భాగ్యరేఖ పాల్గొన్నారు.

ఉద్యమాలకు జానపదాలు ఊపిరి

ప్రజాశక్తి- పలాస

జానపద కళలు, రూపాలు ఉద్యమాలకు ఉపిరి అందించేవని, అటువంటి జానపద కళలు ద్వారానే తెలంగాణ రాష్ట్రం సాధించగలిగిందని గిడుగు రామ్మూర్తి కళాపీఠం వ్యవస్థాపకులు బద్రి కూర్మారావు అన్నారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ పాఠశాలలో జానపద కళాకారులు, వృత్తికళాకారులు ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. పలువురు జానపద కళాకారులు జానపద పాటలను ఆలపించి జానపదకళల విలువలను చాటిచెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమాలకు ఊపిరిగా ఉన్న ఉద్దానం ప్రాంతంలో గతంలో ఎక్కువగా జానపద కళలు, పాటలు వినిపించాయని అన్నారు. అందులో సుబ్బారావు పాణిగ్రహి జముకులపాట ఎంతో ప్రసిద్ధి చెందిందని గుర్తు చేశారు. దాని స్ఫూర్తితో ఎంతో మంది జానపద పాటలు రాసి వాటిని ఆలపించి అందరినీ అలరించారని అన్నారు. అటువంటి జానపద కళలు ప్రస్తుతం మరుగున పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జానపద కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో సొంతంగా పింఛన్లు అందిస్తూ కళలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఉద్యమ నేపథ్యంలోనే జానపదకళలను ఊపిరిపోయాలన్నారు. కిడ్ని వ్యాధులపై జానపద కళారూపాలతో బయటకు తీసుకువచ్చే ప్రయత్నం చేయాలన్నారు. వంద కలాలు, వెయ్యి ఏనుగుల బలంతో సమానమని పేర్కొన్నారు. సమావేశంలో జానపద కళాకారులు కుమార్నాయక్, వంకల రాజారావు, బమ్మిడి సుబ్బారావు, జోగారావు, మడు నాగేశ్వరరావు, కొనేరు ఆదినారాయణ, ఉర్నాన అప్పలరాజు, తామాడ సన్యాసిరావు, ఓంకార్ మాస్టారు, కోటేశ్వరరావు, అమ్మా రామకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కూర్మారావు

చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వృద్ధుల సంరక్షణతో పాటు వారి రక్షణకు ప్రభుత్వం చేసిన చట్టాలు సమర్ధవంతంగా అమలు చేయాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు కోరారు. నగరంలోని శాంతా కళ్యాణ్ అనురాగ నిలయంలో సీనియర్ సిటిజన్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రపంచ వృద్ధుల వేధింపుల నియంత్రణ దినోత్స వాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులపై వేధింపులను నియంత్రణతో పాటు వృద్ధుల పోషణ, సంరక్షణ, ఆస్తి, ప్రాణ రక్షణకు ఏర్పాటు చేసుకున్న చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బలివాడ మల్లేశ్వరరావు, ప్రకాశ రావు, జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి నరసింహ మూర్తి, అసోసియేట్ అధ్యక్షులు సోమసుందర రావు, కోశాధికారి ప్రసాదరావు, బి.మోహనరావు, రాజేశ్వరరావు, వి.నాగేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, డి.చిరంజీవిరావు, వి.బోడయ్య, కె.రామ్మోహనరావు, డాక్టర్ సోమేష్ పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్లు

ఒబిసి సాధనకు కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సొండిలను ఒబిసిలో సాధనకు ప్రభుత్వం కృషి చేయాలని సొండిల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ్ చౌదరి డిమాండ్ చేశారు. నగరంలోని నాగావళి హోటల్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి సొండిల సంక్షేమ సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొండీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకోవలన్నారు. నూతన ప్రభుత్వం అబ్కారీ విధానంలో షాపులు, బార్ కేటాయింపులో వంద శాతం సొండికు కేటాయించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి సాహుకారి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, భాషాపరంగా ఆదుకోవాలని కోరారు. సమావేశంలో కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, రత్నాల నర్సింహమూర్తి, రత్నాల జగన్మోహనరావులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు


పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు పట్టణానికి తాగునీరందించే పైపులైనులు కొద్ది రోజులుగా మరమ్మతులకు గురైంది. దీంతో పట్టణ వాసులకు సరిపడా తాగునీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాలతో పైపులైనులు మరమ్మతులకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. లైదాం వద్ద గల రెల్లిగెడ్డ నుంచి పైపులైన్ల ద్వారా పొందూరు పట్టణానికి తాగునీరందుతోంది. పైపులైన్ల లీకేజీతో తరచుగా మరమ్మతులకు గురవుతోంది. ఆదివారం ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చైతన్య, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రామ్మోహన్, పట్టణ అధ్యక్షులు చిన్నరంగా లీకేజీ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఒత్తిడి కారణంగా తరచూ లీకేజీ సమస్య వస్తోందని గుర్తించారు. ఈ మేరకు మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నీటి సరఫరా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పొందూరు: మండలంలోని వావిలపల్లిపేట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్హులైన విద్యార్థులు తమ దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలని, వీరికి ఈ నెల 22న ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నామని అన్నారు. అందులో వచ్చిన మార్కుల ఆధారంగా వారికి ప్రవేశాలను కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు పాఠశాలను సంప్రదించాలని ఆయన కోరారు.


పనులు చేస్తున్న రైతులు

శ్రమదానంతో గ్రోయిన్స్ పనులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని తీరప్రాంత గ్రామాల రైతులు శ్రమదానంతో గ్రోయిన్స్ పనులు చేపట్టారు. బూర్జపాడు, డొంకూరు, పెద్దలక్ష్మీపురం, చిన్నలక్ష్మీపురం, శివకృష్ణాపురానికి సంబంధించిన 600 మంది రైతులు సొంత ఖర్చులతో వారం రోజులపాటు పనులు చేపట్టారు. ఈదుపురం వంతెన వద్ద ఉన్న కేసుపురం గ్రోయిన్స్‌ను రైతులు సొంత సొమ్ములు రూ.2.50 లక్షలతో మరమ్మతులు చేపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో తమ సమస్యలు పరిష్కారంపై ఎమ్మెల్యే బెందాళం అశోక్ చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

25 విద్యుత్ స్తంభాలు నేలమట్టం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో శుక్రవారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులకు స్థానిక ఎన్‌టిఆర్ కాలనీ, రేవతిపతి వీధి, మండలంలోని వి.ఆర్.కె.పురం, తొలుసూరుపల్లి, బన్నువాడ తదితర గ్రామాల్లో 25 వరకు విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. దీంతో టెక్కలి టౌన్‌తో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో అంధకారం అయింది. అదే సమయంలో ఈదురుగాలులు ప్రజలు ఎవరు బయట లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

20 ఏళ్లుగా మోసపోతూనే ఉన్నాం


దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు

కవిటి: ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారుల తీరుతో గత 20 ఏళ్లుగా తాము మోసపోతున్నామని బెంతు ఒరియా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ మండల కేంద్రంలో బెంతు ఒరియాలు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 172 రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో తరగతి, ఉప తరగతి పేరుతో కూడిన ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రం జారీ చేయకపోవడంతో బెంతు ఒరియా విద్యార్థులు ఉపాధి, ఉన్నత చదువులు కోల్పోతున్నారని అన్నారు. తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో అనేక మంది బెంతు ఒరియా విద్యార్థులు చదువుకి దూరమై, చేతి వృత్తులపై ఆధారపడుతూ జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రభుత్వాలు మారినప్పడల్లా కమిటీలు పేరుతో కాలక్షేపం చేస్తూ... ఎన్నికలు వచ్చేసరికి రాజకీయ పార్టీలు ఓట్లు వెయ్యించుకుని తమను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా తమకు పూర్తి స్థాయిలో ధ్రువపత్రాలు జారీ చేయాలని కోరారు.

తూర్పుకాపులకు అవకాశం ఇవ్వాలి

శ్రీకాకుళం అర్బన్: నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం త్వరలో ఎంపిక చేయనున్న నామినేటెడ్ పదవుల్లో జిల్లాలోని తూర్పుకాపులకు సముచిత స్థానం కల్పించాలని తూర్పుకాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సురంగి మోహనరావు కోరారు. నగరంలోని వినీలా హోటల్‌లో ఆదివారం తూర్పుకాపు సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తరపున తూర్పుకాపుల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన కిమిడి కళావెంకటరావు, మామిడి గోవిందరావు, కొండపల్లి శ్రీనివాసలతో పాటు ఎంపీగా గెలిచిన కలిశెట్టి అప్పలనాయుడుకు అభినందనలు తెలిపారు. త్వరలో ఎంపిక చేయనున్న ఎమ్మెల్సీ, గ్రంథాలయ చైర్మన్ తదితర నామినేటెడ్ పదవుల్లో తూర్పుకాపులకు అగ్రతాంబూలం ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాడ కైలాసరావు, శాసపు జోగినాయుడు, కిలారి నారాయణరావు, అప్పలనాయుడు, న్యాయవాదులు వాన కృష్ణచంద్, కెఎల్‌వి రాశేఖర్ పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న నాయకులు


మొక్కను నాటుతున్న సుబ్బారావు

సులభ్ కాంప్లెక్స్ ప్రారంభం

ప్రజాశక్తి- సోంపేట

మండల కేంద్రంలోని బాలికోనత పాఠశాల సమీపంలో స్థానిక గ్రామ పంచాయతీ రోటరీ క్లబ్ సంయుక్తంగా నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను రోటరీ గవర్నర్ సుబ్బారావు, అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోటరీ గవర్నర్ చేతుల మీదుగా భవన సమీపంలో మొక్కలు నాటారు. అనంతరం రోటరీ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ భాగస్వామ్యం ఎప్పుడూ ఉంటుందన్నారు. స్థానికలతో పాటు ఇతర గ్రామాల నుంచి పనుల నిమిత్తం వచ్చే వారంతా ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు దినేష్‌కుమార్, కె.రవికుమార్, టి.వి.కృష్ణారావు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సురేష్

200 మందికి వైద్య పరీక్షలు

ఆమదాలవలస : మండలంలోని చింతాడలో వైద్యులు సంఘ సేవకులు, నగరంలోని సన్ రైజ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆదివరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది రోగులకు బిపి, సుగర్, థైరాయిడ్, కీళ్లవాతాలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ పరిసరాల్లో పలుచోట్ల మొక్కలు నాటి గ్లోబల్ వార్మింగ్ గురించి ప్లాస్టిక్ నిషేధం గురించి అవగాహన కల్పించారు. ప్రజలందరూ మానసిక రుగ్మతలను, చెడు అలవాట్లను విడిచిపెట్టి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొలి సంతకం డిఎస్‌సిపై హర్షం

టెక్కలి రూరల్ : ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల మేరకు మెగా డిఎస్‌సిపై మొదటి సంతకం చేసి ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిలబెట్టుకున్నారని రాష్ట్ర నిరుద్యోగ పోరాట సమితి ప్రధాన కార్యదర్శి తలసముద్రం సూర్యం హర్షం తెలిపారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వారాహి యాత్రలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పినట్లు హామీలు అమలకు శ్రీకారం చుట్టడంఅ భినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్.దేవరాజ్, ఎస్.శివ, ఆర్.రాధాకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూర్యం